
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 12 । ఆగస్టు । 2024



రొయ్య 'ధర'హాసం
రొయ్య ధరలు స్వల్పంగా పెరగడంతో ఆక్వా రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. రెండు రోజుల నుంచి వంద కౌంట్ రూ.250కు చేరింది. 8లో



మెలకువలతో మేలు
పంటల్లో చీడపీడల నియంత్రణ కోసం ఎరువులు, పురుగు మందుల వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో



తాళం వేసిన ఇళ్లే టార్గెట్
పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



పరీక్ష కోసం వచ్చిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం : వైద్య కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నీట్ పీజీ పరీక్ష మండలంలోని పెద తాడేపల్లిలో వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం షిఫ్టుల్లో 222 మంది హాజరు కావాల్సి ఉండగా ఉదయం ఇద్దరు, సాయంత్రం నలుగురు అభ్యర్థులు హాజరుకాలేదు. పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ రత్నాకర్‌రావు, కో–ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఇసుక

భీమవరం (ప్రకాశంచౌక్) : తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల వారీగా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యత వివరాలను ఆదివారం కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రు వద్ద 10,965 టన్నులు, పెండ్యాల వద్ద 1,16,956 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రు వద్ద 41,324 టన్నులు, అలాగే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు–1 వద్ద 2,686 టన్నులు, రావులపాడు–2 వద్ద 3,260 టన్నులు ఇసుక అందుబాటులో ఉందన్నారు.

సైనికులను స్మరించుకుందాం



సత్కార గ్రహీతలతో హోం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు బొలిశెట్టి, పత్సమట్ల

తాడేపల్లిగూడెం : దేశం కోసం అసువులు బాసిన సైనికులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పట్టణంలోని ఏపీ నిట్‌లో ఆదివారం కార్గిల్ విజయ దివస్ రజిత్ జయంత్ మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న పరమ వీరచక్ర అవార్డు గ్రహీత సుబేదార్ మేజర్ సంజయ్‌కుమార్ ఆనాటి సంగతులను విశదీకరించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాసు, పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ రాష్ట్ర నేత సోము వీర్రాజు, మాజీ మేజర్ జనరల్ బీవీ రావు తదితరులు పాల్గొన్నారు. నిట్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

వారి త్యాగం చిరస్మరణీయం

దేశ రక్షణలో ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పెంటపాడు మండలం అలంపురంలోని టీబీఆర్ సైనిక్ స్కూలులో జరిగిన కార్గిల్ విజయ దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎయిర్‌ఫోర్సు వెట్రన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తనబుద్ధి భోగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

కారు ఘటనపై స్పందించిన అనిత

నారాయణపురం వద్ద జరిగిన కారు ఘటనలో తనకు ఏమీ కాలేదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి అనిత అన్నారు. ఎస్కార్టు వాహనానికి బైక్ అడ్డురాగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందన్నారు.

శిలాఫలకాల ధ్వంసం హేయం



సుందర్‌కుమార్

ఉండి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన అద్భుత పాలనను జీర్ణించుకోలేని కూటమి నేతలు ఆయన పేరుతో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడం హేయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, న్యాయవాది జి.సుందర్‌కుమార్ అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్ పేరు ఉండటాన్ని చూసి తట్టుకోలేని కూటమి నేతలు శిలాఫలకాన్ని పగులగొట్టడాన్ని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయాల వద్ద ఉన్న జగన్ ఫొటోలు, శిలాఫలకాలు ధ్వంసం చేయడం వంటి హింసాయుత సంస్కృతికి నాంది పలికిందని ఆరోపించారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ వంటి పథకాలపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో రాష్ట్రంలో హింస ప్రేరేపిస్తున్నారని విమర్శించారు.

పంచాయతీలపై పచ్చ పెత్తనం

హక్కులను కాలరాసి.. సర్పంచ్‌లను విస్మరించి..

- ఎమ్మెల్యేల కనుసన్నల్లో కార్యక్రమాలు
- అడుగడుగునా ప్రొటోకాల్ ఉల్లంఘనలు
- ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులకు అందని ఆహ్వానం
- పంచాయతీరాజ్ వ్యవస్థకు తూట్లు
- ఎస్సీ సర్పంచ్‌ల విషయంలో మరింత వివక్ష
- వైఎస్సార్‌సీపీ మద్దతు ఉన్న గ్రామాల్లో అడ్డగోలుగా..
- హక్కుల ఉల్లంఘనపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు
- కలెక్టర్, డీపీఓలకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పంచాయతీల్లో హక్కుల ఉల్లంఘనకు తెర లేచింది. రాజకీయ పార్టీల గుర్తులు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి జరుగుతుంటాయి. పార్టీతో నిమిత్తం లేకుండా పంచాయతీల్లో జరిగే ప్రతి కార్యక్రమం, ప్రతి అభివృద్ధి పనిలో సర్పంచ్ పాత్ర కీలకం. అలాంటి సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యానికి ఎమ్మెల్యేలు తెరదీశారు. మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్నా అడుగడుగునా ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు మొదలు ఎస్సీ కమిషన్ వరకు సర్పంచ్‌లు ఫిర్యాదు చేసి హక్కుల కోసం న్యాయపోరాటానికి దిగడం జిల్లాలో సంచలనంగా మారింది.

సర్పంచులపై రాజకీయ వివక్ష

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో పెన్షన్ పంపిణీ, విద్యాభివృద్ధికి స్కూల్ కిట్ల పంపిణీ, కొన్ని చోట్ల గ్రామసభలు, ఇతర శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్న గ్రామ పంచాయతీల్లో జరిగే కార్యక్రమాలకు సర్పంచులకు కనీస ఆహ్వానం ఇవ్వని పరిస్థితి ఉంది. అంతేకాకుండా వారిమీద పోటీ చేసి ఓడిపోయిన టీడీపీ సానుభూతిపరులను, జనసేన సానుభూతిపరులను కలుపుకొని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వ్యవస్థను నిర్వీర్యం చేసేలా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం దిశగా కూటమి ఎమ్మెల్యేలు కుట్రలు చేస్తున్నారు. పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా గెలిచిన వారిలో దాదాపుగా 75 శాతానికి పైగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2021 ఫిబ్రవరి 21న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో 892 గ్రామ పంచాయతీలకు గాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు 650 మంది, టీడీపీ సానుభూతిపరులు 167 మంది, జనసేన మద్దతుదారులు 46 మంది, బీజేపీ మద్దతుదారు ఒకరు, ఇతరులు 27 స్థానాలు కైవసం చేసుకున్నారు. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రమేయం గాని, రాజకీయ పార్టీల గుర్తులు గాని ఉండవు. కేవలం స్వతంత్రులకు కేటాయించే గుర్తులతో ఎన్నికలు జరుగుతుంటాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రత్యేక పారితోషికాలు కూడా ఉంటాయి. ఈ క్రమంలో పల్లెల అభివృద్ధి కోసం, రాజకీయ వివాదాలకు తావులేకుండా అందరూ ఒకే మాట మీద ఉండేలా ఏకగ్రీవాల దిశగా ప్రయత్నాలు జరుగుతాయి. గడచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో 150కి పైగా గ్రామాల్లో ఏకగ్రీవాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పంచులపై వివక్ష చూపుతున్నారు.

2026 వరకు మేమే సర్పంచులం



2026 ఏప్రిల్ 23 వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సర్పంచులకు పదవీ కాలం ఉంది. రాజకీయ పార్టీల పేరుతో వేదింపులకు పాల్పడితే న్యాయపోరాటంతో పాటు ప్రజాపోరాటం చేస్తాం. జిల్లాలో పలు పంచాయతీల్లో ఓడిపోయిన నేతలకు పెత్తనం అప్పగించడంతో పాటు గ్రామ కార్యదర్శి కూడా వారి కనుసన్నల్లోనే పనిచేయాలని ఆదేశాలు ఇవ్వడం సరికాదు.


– మెండెం సంతోష్‌కుమార్, ముప్పవరం సర్పంచ్, దెందులూరు మండలం

అదేమిటని ఒకరిద్దరు సర్పంచులు ప్రశ్నిస్తే.. ఇది మా ప్రభుత్వం... మా ఇష్టమంటూ ఘాటుగా వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే చింతమనేనిపై ఫిర్యాదు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 90 స్థానాల్లో ఎస్సీ రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థులు గెలుపొందారు. రిజర్వుడ్ గ్రామ పంచాయతీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కనీసం గ్రామ కార్యదర్శి కూడా ఫోన్లకు స్పందించని స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో దెందులూరు నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధి చింతమనేని ప్రభాకర్ ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఎస్సీ సర్పంచుల సంఘానికి ఫిర్యాదు అందింది. జిల్లా పంచాయతీ అధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌తో పాటు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దెందులూరు మండలం ముప్పవరం పంచాయతీ సర్పంచ్ డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నా ఇప్పటి నుంచే వేధిస్తుండటం సరికాదని, ప్రొటోకాల్ పక్కాగా అమలయ్యేలా ఆదేశించాలని ఫిర్యాదులో కోరారు.

గొల్లభామ.. రంగులు మార్చిందమ్మా..



ఏకకాలంలో రెండు రంగులతో గొల్లభామ ఆకట్టుకుంది. కొయ్యలగూడెంలోని ఓ ఆసామి ఇంట్లో ఓ గొల్లభామ దుస్తుల మీద వాలినప్పుడు ఓ రంగులో, కుర్చీ మీదకు ఎగిరినప్పుడు మరో రంగు మార్చుకుని అలరించింది. గొల్లభామలు దేహవర్ణ కాంతులను విరజిమ్ముతూ ఎదుటి కీటకాలను ఆహారంగా తీసుకోవడానికి ఆకర్షిస్తుంటాయని, ఈ క్రమంలో శత్రువుల బారి నుంచి కాపాడుకోవడానికి ఇలా రంగులు మారుస్తుంటాయని జువాలజీ ప్రొఫెసర్ ఎం.శైలజ తెలిపారు. రంగును మార్చుకోవడానికి వెనుక కాళ్లను ఒకదానికొకటి రుద్దుకోవడం వల్ల హార్మోన్ల ప్రభావంతో మార్పులు సంభవిస్తాయని చెప్పారు.

– కొయ్యలగూడెం

'అన్న'న్నా.. ప్రజాధనంతో సోకులా..?

- రూ.32.44 లక్షలతో నాలుగు వార్డు సచివాలయాలకు మరమ్మతులు
- బాగున్న భవనాలకు పచ్చ రంగు పులుముతున్న సర్కారు
- ప్రజాధనం దుర్వినియోగంపై విమర్శలు



ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన అన్న క్యాంటీన్

ఏలూరు (టూటౌన్) : నిన్నటివరకు ఆ భవనాలు వార్డు సచివాలయాలుగా పనిచేసినవే. అంటే వినియోగానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉన్నవే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2019కు ముందు ఉన్న అన్న క్యాంటీన్లను మరలా తెరిచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈనెల 15 నుంచి వీటిని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. దీంతో ఏలూరు నగరంలోని నాలుగు వార్డు సచివాలయాలను అన్న క్యాంటీన్లుగా మారుస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు వార్డు సచివాలయాలుగా ఉన్న ఇండోర్ స్టేడియం, రామకోటి ప్రాంతం, ఆర్‌ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి గుడి వద్ద, తంగెళ్లమూడి వద్ద ఉన్న భవనాలను తాజాగా లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేస్తున్నారు. ఇందుకోసం రూ.32.44 లక్షల అంచనా వ్యయం ఖర్చు చేస్తున్నారు. బాగానే ఉన్న భవనాలకు కేవలం పచ్చ శోకులు చేసేందుకు ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి ధర్మాన్ని విస్మరించి..

కూటమి ప్రభుత్వంలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీలు భాగస్వాములుగా ఉన్నాయి. అయితే అన్న క్యాంటీన్ల భవనాలపై ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు ఫొటోలను మాత్రమే వేయడంపై జనసేన, బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. తమ పార్టీ నాయకుల ఫొటోలను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆటపాకకు అదనపు హంగులు

పక్షుల కేంద్రానికి కొత్త కళ

- రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు
- పక్షుల నివాస స్టాండ్లు 60 ఏర్పాటు
- అతిథి గృహానికి మరమ్మతులు
- ఆకట్టుకుంటున్న కొల్లేరు విహంగాల చిత్రాలు



ఆటపాక పక్షుల అందాలు



ఇనుప స్టాండ్లు ఏర్పాటుచేస్తున్న దృశ్యం



పక్షుల కేంద్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఇనుప స్టాండ్లు


కైకలూరు : పక్షి ప్రేమికుల స్వర్గధామం ఆటపాక పక్షుల కేంద్రానికి కొత్త కళ వచ్చింది. పర్యాటకులను ఆకట్టుకోవడానికి అటవీ శాఖ అదనపు హంగులను సమకూర్చింది. ఏటా సెప్టెంబర్ నుంచి మార్చి వరకు సైబీరియా, నైజీరియా, ఆస్ట్రేలియా, శ్రీలంక తదితర దేశాల నుంచి వేల సంఖ్యలో వలస పక్షులు విడిది కోసం కొల్లేరు సరస్సుకు విచ్చేస్తాయి. అతిథి పక్షుల రాక దగ్గర పడటంతో అటవీ శాఖ వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో హిమశైలజ ఆదేశాలతో అధికారులు ఆటపాక పక్షుల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశారు.

పెలికాన్ ప్యారడైజ్‌గా..

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విదేశీ పెలికాన్ వలస పక్షులు ఎక్కువగా విహరించే ఏకైక ప్రాంతం కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం. పెద్ద సంఖ్యలో పెలికాన్ పక్షుల రాక కారణంగా దీనికి పెలికాన్ ప్యారడైజ్ అని నామకరణ చేశారు. ఆటపాక పక్షుల కేంద్రంలో 289 ఎకరాల్లో పక్షులు విహరించడానికి చెరువును అటవీ శాఖ తవ్వించింది. పక్షుల నివసించడానికి వృక్షాలు లేకపోవడంతో అటవీ శాఖ 150 కృత్రిమ ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేసింది. ఇటీవల వీటిలో 60 స్టాండ్లు తుప్పుపట్టాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేశారు. పెలికాన్ పక్షులు స్టాండ్లపై అలవాటుపడి సంతానోత్పత్తి సాగిస్తాయి.

స్వాగత ద్వారాలు.. మౌలిక వసతులు

ఆటపాక కేంద్రంలో రూ.20 లక్షల నిధులతో ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టామని అటవీ శాఖ డెప్యూటీ రేంజర్ జీవీవీ జయప్రకాష్ చెప్పారు. కేంద్రంలో సీసీ కెమెరాలు, వాల్ పెయింటింగ్, విహార బోట్ల రిపేరు, గెస్ట్ హౌస్‌కు మరమ్మతులు, ఏసీ, వాటర్ కూలర్, లైఫ్ జాకెట్ల కొనుగోలు, చిల్డ్రన్స్ పార్కులో ఇసుక పూడిక, ఆట వస్తువులకు పెయింటింగ్, పర్యాటకులు కూర్చోవడానికి బెంచీల ఏర్పాటు వంటి పనులను చేపట్టామన్నారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి నుంచి పక్షుల కేంద్రం చేరే క్రమంలో స్వాగత ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి.



గోడలపై పక్షుల చిత్రాలు

గూడబాతుల గుంపు.. ఎంతో ఇంపు

కొద్ది రోజుల్లో వలస పక్షుల రాక ప్రారంభం కానుంది. ఇప్పటికే దాదాపు 1,500 పెలికాన్ పక్షులు ఆటపాక కేంద్రంలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఇక్కడ ప్రకృతి, వాతావరణం అనుకూలించడంతో ఆటపాకలో స్థిర నివాసాలకు ఇవి ఇష్టపడుతున్నాయి. ఇక్కడ గూడబాతుల(పెలికాన్) గుంపులను తిలకించేందుకు చాలా మంది ఆసక్తి చూపుతారు. ఇవే కాకుండా కొల్లేరు సరస్సు పరీవాహక ప్రాంతాల్లో దాదాపు 184 వివిధ జాతుల పక్షులను చూడవచ్చు.

పర్యాటక కేంద్రంగా ఆటపాక

బోటు షికారులో విదేశీ, స్వదేశీ పక్షులను దగ్గర నుంచి తిలకించే అవకాశం ఒక్క ఆటపాకలో మాత్రమే ఉంది. ఆటపాక పక్షుల కేంద్రాన్ని ప్రభుత్వం గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు. ఏటా వేసవిలో పక్షులకు నీటి కొరత ఏర్పడటంతో బోటు షికారు నిలిపివేస్తున్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా పంట కాల్వల ద్వారా వచ్చే నీటిని నేరుగా ఆటపాక పక్షుల విహార చెరువుకు మళ్లించేలా ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

అందరినీ ఆకట్టుకునేలా..



పర్యాటకులు అత్యంత ఇష్టంగా భావించే చెరువులో షికారు నిమిత్తం రెండు బోట్లు సిద్ధంగా ఉన్నాయి. పిల్లలు ఆడుకునే పార్కులో ఆట వస్తువులకు రంగులు వేయించాం. పక్షులు విహరించే చెరువులో మోటార్ల ద్వారా పూర్తిస్థాయి నీటిని గతంలోనే నింపాం. ముఖ్యమైన అతిథులు సేదతీరడానికి గెస్ట్‌హౌస్‌కు సైతం మరమ్మతులు చేయించాం. పక్షుల కేరింతలు తిలకించడానికి ఆటపాకను సందర్శించండి.

– కేవీ రామలింగాచార్యులు, ఫారెస్టు రేంజర్, ఏలూరు

కూటమి నేతల ఒత్తిళ్లు.. అంగన్‌వాడీ నిర్వాహకురాలి కన్నీళ్లు

- ఉద్యోగం నుంచి తొలగించేందుకు కుట్ర
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- న్యాయం చేయాలని బాధితురాలి వేడుకోలు

ద్వారకాతిరుమల : అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల ఫిర్యాదులకు తలొగ్గి తనను ఉద్యోగం నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారని మండలంలోని వేంపాడు శివారు చవలవారిగూడెం మినీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు చలపాటి వజ్రం ఆరోపించారు. బాధితురాలి కథనం ప్రకారం.. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వజ్రం 11 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఆమెపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు లేవు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ నాయకులు ఆమెపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆమెను ఎలాగైనా తొలగించి, ఆ స్థానంలో తమకు కావాల్సిన వారిని నియమించుకోవాలని చూస్తున్నారు. దీనిలో భాగంగా తనపై అసత్య ఆరోపణలు, అభియోగాలు చేస్తున్నారని వజ్రం ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే గత నెలాఖరులో ఐసీడీఎస్ అధికారులు తన వద్దకు వచ్చి రాజీనామా చేయమని చెప్పి అంగన్‌వాడీ కేంద్రం తాళాలు, సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లినట్టు చెప్పారు. అప్పటి నుంచి కేంద్రం మూతపడిందని, దీనిపై మీకోసంలో కలెక్టర్ ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. గత ఐదు నెలలుగా జీతభత్యాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వజ్రం కోరుతున్నారు.

అంబేడ్కర్ స్మృతివనంపై దాడి దారుణం



భీమవరంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

భీమవరం: విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం వద్ద విధ్వంసానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ బహుజన జేఏసీ కమిటీ ఫౌండర్ కన్వీనర్ తాళ్లూరి మధు డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరంలో ప్రకాశం చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ఏపీ బహుజన జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లూరి మధు మాట్లాడుతూ దేశంలోనే విజయవాడలో నెలకొల్పిన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం పెద్దదని, అటువంటి స్మృతివనం వద్ద రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో కాటం స్టాన్లీ రాజు, కోనా జోసెఫ్, బిరుదుగడ్డ రమేష్‌బాబు, దానం విద్యాసాగర్, ఈ.రవికుమార్, గరికి ముక్కు అలీషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ కింద పడిన బైక్


రమణమూర్తి, మృతుడు(ఫైల్)

కుక్కునూరు: అశ్వారావుపేట మండలం వినాయకపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని రాయిగొమ్ముకు చెందిన చింతా రమణమూర్తి(46), ఘంటసాల శ్రీనివాస్(42) శుభకార్యాలకు వంటలు చేస్తుంటారు. ఆదివారం వినాయకపురం ముత్యాలమ్మగుడి వద్ద జరిగిన శుభకార్యానికి వంట చేసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తుండగా పెట్రోల్ బంక్ వద్ద వెనక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా రమణమూర్తి గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం అశ్వారావుపేటకు తరలించారు.

ముత్యాలమ్మ దర్శనానికి భారీగా భక్తులు


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: శ్రావణ మాసం మొదటి ఆదివారం కావడంతో బండి ముత్యాలమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, సభ్యులు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

ఉండి: వ్యాన్ డ్రైవర్, ద్విచక్రవాహనదారుడి మధ్య ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆకివీడుకు చెందిన షేక్‌మీరా మోహిద్ అనే వ్యక్తి ఈ నెల 8వ తేదీన వేగంగా వెళుతున్న వ్యాన్ డ్రైవర్ ఎలీషాను వేగంగా ఎందుకు వెళుతున్నావని ప్రశ్నించడంతో ఎలీషా దాడి చేసి కొట్టాడు. ఇదే ఘటనకు సంబంధించి తాను వ్యాన్‌పై వెళుతుంటే షేక్ మీరా మోహిద్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని తన వ్యాన్‌కు అడ్డంగా పెట్టి బూతులు తిట్టి తనను కొట్టాడని, అలాగే తన వ్యాన్‌లో ఉన్న రూ.30 వేల నగదు తీసుకుపోయాడని వ్యాన్ డ్రైవర్ ఎలీషా ఫిర్యాదు చేశాడు. ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు హెచ్‌సీ యేషయా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్య ధరహాసం

- ఉత్పత్తి తగ్గడంతో రెండ్రోజులుగా పెరిగిన ధర
- కొద్ది మందికే ప్రయోజనమంటున్న రైతులు
- తెగుళ్లకు భయపడి ముందే అమ్మేసుకున్న రైతులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రొయ్య ధరలు స్వల్పంగా పెరగడంతో ఆక్వా రైతులు కొద్దిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా అకాల వర్షాలు, వరదలకు రొయ్యల చెరువులకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో ఉత్పత్తి తగ్గడంతో గత రెండు రోజుల నుంచి వంద కౌంట్ రూ.250కు చేరింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల బెడదతో ఉత్పత్తి తగ్గి ధర పెరిగింది. పెరిగిన ధర కొద్ది మంది ఆక్వా సాగుదారులకు మాత్రమే ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇవే ధరలు కొనసాగితే మాత్రం ఆక్వా రంగం ఇబ్బందుల నుంచి కొంత గట్టెక్కే అవకాశం ఉంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, ఉండి, కైకలూరు తదితర నియోజకవర్గాల్లోని 2.53 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగుచేస్తున్నారు. 60 శాతం మేర వనామీ రొయ్య సాగవుతుండగా మిగిలిన విస్తీర్ణంలో చేపలు పెంచుతున్నారు. గతేడాది జులై చివరి వరకు అధిక ఉష్ణోగ్రతలు ఉండటంతో రొయ్యల పెంపకం ఆశాజనకంగా సాగింది. ఈ ఏడాది జూన్ చివరి వారం నుంచే వర్షాలు మొదలయ్యాయి. గత నెలలో కురిసిన



భారీ వర్షాలకు చెరువుల్లో పీహెచ్, అమ్మోనియా, నైట్రేట్, ఆక్సిజన్ శాతాల్లో హెచ్చుతగ్గులతో వైరస్ బెడద వెంటాడింది. చాలా చెరువుల్లో 35 రోజుల లోపే రొయ్యలు చనిపోయి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. వైట్ స్పాట్, విబ్రియో, వైట్ గట్, ఈహెచ్‌పీ తదితర వ్యాధులు ప్రబలి రొయ్యలు మృత్యువాత పడటంతో నిర్ణీత కౌంట్ రాకుండానే చాలాచోట్ల రైతులు హడావిడిగా పట్టుబడులు పట్టి అయినకాడికి అమ్ముకున్నారు.

కొరతతో పెరుగుతున్న ధర

ఉమ్మడి జిల్లాలోని ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి అమెరికా, చైనా, జర్మనీ, ఉత్తర, దక్షిణ కొరియా, కెనడా, థాయ్‌లాండ్, సింగపూర్, జపాన్ దేశాలకు రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌కు తగిన రీతిలో ఉత్పత్తి లేక రొయ్య ధర పెరుగుతోంది. రెండు వారాల క్రితం 100 కౌంట్ ధర రూ. 220 ఉండగా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.250కు చేరుకుంది. 90 కౌంట్ రూ.260, 80 కౌంట్ రూ.270, 70 కౌంట్ రూ.290, 60 కౌంట్ రూ.310, 48 నుంచి 50 కౌంట్ రూ.330, 46 నుంచి 47 కౌంట్ రూ.335, 43 నుంచి 45 కౌంట్ రూ.340, 38 నుంచి 40 కౌంట్ రూ.365, 36 నుంచి 37 కౌంట్ రూ.370 వరకు ఉన్నాయి. తెగుళ్లకు భయపడి అధికశాతం మంది రైతులు వంద కౌంట్‌కే పట్టుబడులు చేస్తుంటారు. వంద కౌంట్ రూ.250కు చేరడం ఆక్వా రంగానికి మంచి ధర అయినప్పటికి కొద్ది మంది రైతులకు మాత్రమే పెరిగిన లాభం దక్కుతుంది.

పెరిగిన ధర ఏడాదంతా కొనసాగాలి



నేను రెండు ఎకరాల్లో వనామీ రొయ్యలు సాగు చేస్తున్నాను. 100 కౌంట్ రూ.190 కూడా కొనేవారు ఉండరు. ఇప్పుడు వర్షాల వల్ల వైరస్ రావడంతో పట్టుబడి వచ్చిన రొయ్యలు ఎక్కడా లేవు. ఇప్పుడు పెరిగిన ధర చూసి చెరువుల్లో రొయ్య పిల్ల వేస్తే వైరస్ దాటికి చచ్చిపోతున్నాయి. పెరిగిన ధరలు ఏడాది పొడవునా ఉండేలా చేస్తే బాగుంటుంది. మాలాంటి చిన్నకారు రైతులు అధిక పెట్టుబడులతో రొయ్యలు చెరువు చేయాలంటేనే భయమేస్తుంది. ధరలు స్థిరంగా ఉంచి రైతులను ఆదుకోవాలి.

బొమ్మిడి కొండరాజు, రైతు, తోకతిప్ప

వివాదాస్పదంగా ఆలయ గోపుర నిర్మాణం


గూట్లపాడులో గోపుర నిర్మాణ పనులు

భీమవరం అర్బన్: గూట్లపాడులోని రక్షిత మంచి నీటి చెరువు గట్టుపై నిర్మిస్తున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ గోపుర నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఆలయ కమిటీ సభ్యులు చేపట్టే గోపురం నిర్మాణం వల్ల తమ ఇళ్లకు సూర్యరశ్మి, గాలి, వెలుతురు రావడం లేదని, దీంతో తమ కుటుంబాలకు అరిష్టం జరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి సమీపంలో ఉన్న కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మరి కొంత మంది ఆదివారం మాట్లాడుతూ సుమారు 100 సంవత్సరాలకు పైగా తమ పూర్వీకుల కాలం నుంచి ఇళ్లు నిర్మించుకుని ఇక్కడే ఉంటున్నామన్నారు. అయితే తమ ఇళ్లకు సమీపంలో గ్రామ పోరంబోకు భూమిలో రక్షిత మంచినీటి చెరువు గట్టుపై మూడు దేవాలయాలు ఉన్నాయని, దీనిలో ఒక ఆలయ గోపురాన్ని నిర్మిస్తున్నారని, దీనిని 18 అడుగుల 9 అంగుళాలు ఎత్తున నిర్మిస్తున్నామని మొదట్లో స్థానికులతో చెప్పి ఇప్పుడు దీనిని 27 అడుగులకు ఎత్తు పెంచి నిర్మిస్తున్నారని ఆరోపించారు. గోపుర నిర్మాణంపై పంచాయతీ తీర్మానం, ఉన్నతాధికారుల అనుమతులు లేవన్నారు. దీనిపై ఏప్రిల్ 8 స్పందనలో తహసీల్దార్‌కు, 15న కలెక్టరేట్ డీపీవోకు వినతిపత్రం ఇచ్చామన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు నిర్వాహకులకు నిర్మాణ పనులను నిలిపివేయాలని చెప్పినా ఆలయ కమిటీ సభ్యులు ముందుకు వెళ్లడం సరికాదన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన ఆదేశాలను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. గోపురం నిర్మాణం చేపడితే చుట్టుపక్కల ఉండే 8 కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణం చేస్తున్నారని, దీనికి ఎటువంటి అనుమతులు అవసరం లేదన్నారు. హైకోర్టులో ఈ కేసు విచారణ అనంతరం ఆదేశాలపై స్పందిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, 1971లో శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారు ఆలయ నిర్మాణం చెరువు గట్టుపై జరిగిందని అప్పటి నుంచి వార్షికోత్సవాలు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల కట్టడి


ఏలూరులో విజిబుల్ పోలీసింగ్ చేస్తున్న టూటౌన్ ఎస్సైలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల కట్టడి, రహదారి ప్రమాదాల నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు నగరం, జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఏలూరు నగరంలో వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సైలు ఎన్.లక్ష్మణబాబు, టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్సైలు మదీనా భాషా, సాధిక్, త్రీటౌన్ సీఐ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సై ఫణీంద్ర, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది జోరుగా వాహన తనిఖీలు చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురికావద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే భారీగా జరిమానాలు, జైలు శిక్షలు విధిస్తారని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మోటారుసైకిళ్లపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించాలని పోలీస్ అధికారులు హితవు పలుకుతున్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు.

నడ్డి విరుస్తున్న వడ్డీ దందా

- పథకాలందక వడ్డీ వ్యాపారుల్ని ఆశ్రయిస్తున్న ప్రజలు
- అటకెక్కిన రైతు భరోసా, అమ్మ ఒడి, ఆసరా, చేయూత

భీమవరం: ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడం, పథకాల అమలును అటకెక్కించడంతో ... జిల్లాలో సామాన్యులు పిల్లల చదువులు, చిరు వ్యాపారాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక పక్క విద్యా సంవత్సరం ప్రారంభం.. మరోవైపు సార్వా సీజన్ ప్రారంభం కావడంతో మధ్యతరగతి ప్రజలు, సన్న, చిన్నకారు రైతులు వడ్డీలకు డబ్బులు తెచ్చుకుని సర్దుబాటు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాసంవత్సరం ప్రారంభంలో అమ్మ ఒడి పథకంలో విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.15 వేలు జమ చేసేవారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఇతర ఖర్చులకు ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. రైతులకు రైతు భరోసా సొమ్ములు, చిరు వ్యాపారులకు ఆసరా, చేయూత పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలచేది. దీంతో పేదలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందిపడకుండా జీవనం సాగించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలకు కోత పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నెలకు రూ.10 నుంచి రూ.20 వడ్డీ

జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాలతోపాటు అనేక మండల కేంద్రాలు, గ్రామాల్లో తోపుడు బళ్లు, సైకిళ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ వేలాది మంది జీవిస్తున్నారు. మరికొంతమంది మహిళలు ఇంటి వద్దనే చిరు వ్యాపారాలు చేస్తున్నారు. చిరు వ్యాపారులకు వైఎస్ జగన్‌మోహన్



రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఎలాంటి హామీ లేకుండా బ్యాంకుల నుంచి రూ.10 వేలు రుణం పొందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆసరా, చేయూత పథకాలను పక్కన పెట్టడంతో చిన్న వ్యాపారులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సివస్తుంది. దీంతో రోజుకు రూ.1000కి రూ. 200 వరకు వడ్డీ తీసుకుని అప్పులిస్తున్నారు. పెద్ద మొత్తంలో అయితే రూ.1000కి నెలకు రూ.100 వసూలు చేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు.

రైతులదీ అదే పరిస్థితి

సార్వా సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా సొమ్ములు ఇవ్వలేదు. దీంతో రైతులు వ్యవసాయ పెట్టుబడులు కోసం వడ్డీ వ్యాపారులు, ధాన్యం కమిషన్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం కింద ఒక్కో రైతుకు రైతు భరోసా సొమ్ములు చెల్లించడంతో వరి నాట్లు వేయడానికి పెట్టుబడి కోసం ఇబ్బంది ఉండేదికాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలకు పెంచుతామన్న చంద్రబాబునాయుడు రైతులను పట్టించుకోకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని సుమారు 21 వేల మంది రైతులకు ప్రభుత్వం ధాన్యం డబ్బులు దాదాపు రూ.450 కోట్లు చెల్లించాల్సిఉండడంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.

బంగారం, ఆస్తిపత్రాలు తాకట్టు పెట్టుకుని

వడ్డీ వ్యాపారులు రైతులు, చిరు వ్యాపారుల నుంచి బంగారం, ఆస్తిపత్రాలు వంటి వాటిని తాకట్టుపెట్టుకుని నగదు ఇస్తున్నారు. అప్పు తీసుకున్న వ్యాపారులు సకాలంలో సొమ్ములు చెల్లించకపోతే మరింత అధికవడ్డీతో పాటు వసూళ్లకు వచ్చే ఉద్యోగులు జీతాల ఖర్చులు సైతం అప్పు తీసుకున్న వారినుంచే వసూలుచేయడంతో వీరిపై మరింత భారం పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు గతంలో మారిదిగా రుణాలు ఇవ్వడంతోపాటు అక్రమ వడ్డీ వ్యాపారంపై దృష్టి సారించి సామాన్యుల నడ్డి విరుస్తున్న వడ్డీ దందాను అరికట్టాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో చోరీ


పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో పోలీసుల విచారణ

పెంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అర్థరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంజెక్షన్లు, మందులు భద్రపరిచే ఫ్రిడ్జ్‌తో పాటు, పలు సామాన్లు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దెభవనంలో నడుస్తున్న ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌కు శనివారం సాయంత్రం సిబ్బంది తాళాలు వేసుకొని వెళ్లిపోయారు. అయితే సబ్‌సెంటర్‌లో వస్తువులు చిందరవందరగా ఉండటం ఆదివారం ఉదయం గుర్తించారు. పెంటపాడు పోలీసులకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: తాడేపల్లిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఈ నెల 10న సుమారు 60 ఏళ్ల వయసున్న వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు తొలుత తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి పేరు, వివరాలు తెలియాల్సి ఉంది. తాడేపల్లిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బాలిక అదృశ్యంపై కేసు నమోదు

యలమంచిలి: తన పెద్ద కుమార్తె కనిపించడంలేదని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం యలమంచిలిలంక గ్రామానికి చెందిన బాలిక పాలకొల్లు కోకోనట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. రోజు మాదిరిగా ఈ నెల 10న కళాశాలకు వెళ్లింది. సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు ఆదివారం బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

చాకుతో దాడికి యత్నం

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ సినిమా థియేటర్‌లో ఓ సినిమా ప్రదర్శన సందర్భంగా యువకుడిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సినిమా ప్రదర్శన సమయంలో ఇద్దరికి చిన్నపాటి ఘర్షణ జరిగింది. శుక్రవారం సాయంత్రం హర్ష ప్రవీణ్‌ను సీహెచ్ రాహుల్ చాకుతో పొట్టలో పొడిచి పారిపోయాడు. గాయపడిన హర్ష ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.


కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం


కోళ్ల వ్యర్థాలు తరలిస్తుండగా పట్టుకున్న వ్యాన్

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యాన్‌ను జాతీయ రహదారిపై సూరప్పగూడెం వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. కోళ్ల వ్యర్థాలతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఏలూరు మండలం కొక్కిరాలలంక గ్రామానికి చెందిన ఘంటసాల శేషుబాబు అతని చేపల చెరువలుకు సొంత వాహనంలో డ్రైవర్, అతని అన్న దొంగల రాజేష్ కలిసి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలోని వేంకటేశ్వర హెచరీస్ నుంచి సుమారు 2 టన్నుల కోడి వ్యర్థాలు లోడ్ చేసుకున్నారు. చెరువుల్లో మేతగా వినియోగించేందుకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు సూరప్పగూడెం వద్ద పట్టుకున్నారు. వ్యాన్‌తో పాటు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందుల వాడకంలో మెలకువలు


పురుగుల మందు పిచికారీ చేస్తున్న వ్యవసాయ కూలీ(ఫైల్)




వీరవాసరం: రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పంటల్లో చీడపీడల నియంత్రణ కోసం ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు పాటించాలి. నకిలీ పురుగుల మందుల బెడద నుంచి రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎరువుల కొనుగోలు, రసాయన పురుగుమందుల వాడకం, పిచికారీ సమయంలో రైతులు వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు పాటించాలి. ప్రస్తుత సార్వా సీజన్‌లో వరిసాగు కుదుళ్ల దశలో ఉంది. చీడ, పీడల బెడద నుంచి తెగుళ్ల నియంత్రణకు కొనుగోలు చేసే రసాయన పురుగుమందులు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఎరువుల దుకాణాల్లో మాత్రమే పురుగు మందులు కొనుగోలు చేయాలి. పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుల మందుల స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరిత మందులైతే నీలి రంగు, తక్కువ విషపూరితమయితే ఆకు పచ్చ రంగు గుర్తులు ఉంటాయి. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులు మాత్రమే పంటపొలాలకు వినియోగించాలి. పంటకు చీడ, పీడ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు వచ్చి వారి సూచనల మేరకు పిచికారీ చేయాలి. రసాయన ఎరువులు, మందులు రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయరాదు. ముందుస్తుగా పురుగుల మందులు కొని ఇళ్ల వద్ద, చేల వద్ద నిలువ చేయకూడదు.

పిచికారీ ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఆహార పదార్థాలతో పాటు పంటలకు పిచికారీ చేసే పురుగు మందులను కలిపి తీసుకు వెళ్లకూడదు. ఇంట్లో మందులు నిలువ ఉంచినప్పుడు ఆ గదికి తాళం వేసి చిన్నపిల్లలకు అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అసలైన ప్యాకింగ్‌తో ఉన్న కీటకనాశిని ఎరువులను కొనుగోలు చేయాలి. ప్యాకింగ్ తెరిచి మందులను ఉపయోగించే ముందు ప్యాకెట్లులోని టేబుల్ వివరాల పత్రాలను చదవాలి.

- మందులు పిచికారీ చేసేటప్పుడు తలకు రక్షణగా, శరీరానికి రక్షణగా ఉండే దుస్తులు, మాసుకలు ధరించాలి.
- మందుల డబ్బాలు ఆహార పదార్థాలు, తాగు నీరు వంటివి నిలువ చేసేందుకు ఉపయోగించరాదు.
- వరిచేల్లో మందును పిచికారీ చేసేటప్పుడు గాలి వీచే దశలో నడవాలి.
- మందు పిచికారీ చేసే సమయాల్లో ఆహార పదార్థాలు తినకూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు.
- స్ప్రే నాజిల్ శుభ్రపరిచేందుకు నోటితో ఊదకూడదు.
- ప్రమాదవశాత్తు శరీరంపైగాని, దుస్తులపైగాని మందు పడితే వెంటనే శుభ్రపరచుకోవాలి.
- వరిచేలపై మందుల పిచికారీని ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే చేయాలి. ప్రమాదవశాత్తు విషప్రభావానికి గురైతే వెంటనే ప్రథమ చికిత్స చేసే వైద్యుడి వద్దకు మందుల డబ్బా వివరాల పత్రాన్ని చూపించి వైద్యం చేయించుకోవాలి. వాడేసిన ఖాళీ డబ్బాలను భూమిలో పాతిపెట్టాలి.

అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



వరిచేలల్లో చీడ, పీడల నియంత్రణకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలి. నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు మాత్రమే వాడుకోవాలి. మందు పిచికారీ చేసే సమయాల్లో వ్యవసాయాధికారులు అందించే రక్షణ వస్త్రాలను ధరించాలి.

టిన్నీబాబు, మండల వ్యవసాయాధికారి, వీరవాసరం

తాళం వేసిన ఇళ్లే టార్గెట్


చోరీ తీరును పరిశీలిస్తున్న ఎస్సై బి.నాగబాబు

ఆకివీడు: పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలోని శ్రీరామపురంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ప్రాంతానికి చెందిన గుగ్గిళ్ల రవితేజ 15 రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. ఆయన బంధువులు ఆదివారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం బద్దలకొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళం బద్దలకొట్టి అల్మారా తెరిచి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. ఆభరణాలు, నగదు ఎంత పోయాయనే విషయం బాధితుడు వచ్చి ఫిర్యాదు ఇస్తే గాని తెలియదని చెప్పారు. ఇటీవల కాలంలో ఆకివీడు ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగల్ని పట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పర్యావరణ హితం.. మట్టి వినాయకుడు


కె.పెంటపాడులో మట్టి వినాయకుడి ప్రతిమను తయారు చేస్తున్న దృశ్యం


పదేళ్లుగా పెంటపాడులో మట్టి వినాయకుడి ప్రతిమలు చేస్తున్న తండ్రీ కొడుకులు

- పల్లెల్లో మొదలైన వినాయక చవితి సందడి
- ముమ్మరంగా విగ్రహాల తయారీ
- మట్టి విగ్రహాలు వినియోగించాలంటున్న పర్యావరణ వేత్తలు


విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న రాజస్థాన్ కార్మికుడు

పెంటపాడు: ఈ నెల 31న వినాయక చవితి పురస్కరించుకొని ఇప్పటికే పల్లెల్లో చవితి సందడి మొదలైంది. ఇప్పటికే పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలు చేసే తయారీదారులు బిజీగా ఉన్నారు. ఇదిలా ఉండగా మట్టితో చేసిన విగ్రహాలను వినియోగించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వలస కార్మికులు గుడారాలు వేసుకొని భారీ సైజు వినాయక ప్రతిమలు చేసే పనిలో ఉండగా, వాటి ధర వేలు పలుకుతోంది. అయితే ప్రధానంగా కాలుష్య రహితంగా తయారు చేసే విగ్రహాలను వాడుకొని పూజలు చేయాలని ప్రభుత్వం కోరుతుంది. వాటినే పోత్సహించాలని చెబుతున్నా యువత రంగుల మోజులో పడి పెద్ద విగ్రహాలకే మొగ్గు చూపుతున్నారు. కాగా మట్టి విగ్రహాలను పోత్సహించేందుకు వీలుగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో సుమారు 20 కుటుంబాలు ఉన్నాయి. పెంటపాడు మండలం కె.పెంటపాడులో నాలుగు కుటుంబాల వారు గత 10, 15 ఏళ్లగా చిన్నపాటి మట్టి విగ్రహాలు తయారు చేసి జీవిస్తున్నారు. వినాయకుడి మట్టి ప్రతిమలు సైజును బట్టి రూ.50 నుంచి 500 వరకు ఉన్నట్లు చెబుతున్నారు. కాగా హోల్‌సేల్‌గా విక్రయించేందుకు వారి ఆర్డర్లను బట్టి తయారు చేస్తున్నట్లు తెలిపారు. కాగా వీరికి మట్టి దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే గూడెం మండలం ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాలలో ఉన్న మట్టి ఈ విగ్రహాలకు అనువుగా ఉంటుందని తయారీదారులు చెబుతున్నారు. అయితే ఈ మట్టిని సంచులతో తెచ్చుకొంటే అధికారులు కేసులు పెడుతున్నారని వాపోయారు. విగ్రహం చక్కని నగిషీ పొందేందుకు అక్కడి మట్టి అందిస్తే మట్టి విగ్రహాలను ప్రోత్సహించే వీలుంటుందని చెబుతున్నారు. కాగా రెవెన్యూ శాఖ తమకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు.

మట్టి విగ్రహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మట్టి విగ్రహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పని చేయాలి. ఎక్కడైనా బీటలు తీస్తే ఆ విగ్రహాలు అమ్ముడు కావు. అయితే వినాయకుడి ఆకర్షనీయమైన రూపం వచ్చేందుకు ఎంతో శ్రమించాలి. చేలల్లి మట్టి పనికిరాదు. కాగా గూడెం మండలం ఎర్రకాలువ ద్వారా కొట్టుకు వచ్చిన మట్టి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఆ మట్టికి పీచుపదార్థం కలిపి వాడుకొంటే చవితి అనంతరం నిమజ్జనంలో మళ్లీ నీటిలో కాలుష్యరహితంగా కరిగిపోయే వీలుంటుంది.

– ఇరగవరపు అయ్యప్ప, కె.పెంటపాడు

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

తణుకు: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం తణుకులో ఎన్నుకున్నారు. స్థానిక సీతారామాంజనేయ దేవస్థానంలో నిర్వహించిన అధ్యక్షుడిగా నల్లంరామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కె.జగదీశ్వరరావు, కార్యదర్శిగా ఇవ్వల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, కోశాధికారిగా పి.కుసుమ కుమార్, కార్య వర్గ సభ్యులుగా ఎంవీవీఎస్ నందకుమార్, జీవీ రమణ, ఎస్కే నబీ, ఎ.సాంబశివరావు, ఎంటీవీ రమణ, డి.శ్రీనివాసరావు, సీహెచ్ వీరభద్ర రావు, టి.వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

కార్మికులు సంఘటితంగా పోరాడాలి


తణుకులో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమారావు

తణుకు: ఏపీ సీడ్స్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం తణుకు సురాజ్య భవన్‌లో ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. భీమారావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వర్గాలకు మేలు చేయడమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. 44 చట్టాలను రద్దు చేసి, కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లే రీతిలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైగా కొండలరావు



తాడేపల్లిగూడెం: పట్టణ ట్రాఫిక్ ఎస్సైగా కె.కొండలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పట్టణంలో ఇంటిలిజెన్స్ విభాగంలో పని చేశారు. తర్వాత గోపాలపురం నియోజకవర్గంలో ఎస్సైగా, రాజమండ్రి సీసీఎస్ ఎస్సైగా పని చేశారు. బదిలీలలో భాగంగా తాడేపల్లిగూడెం ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు.

బీవీఆర్ కళా కేంద్రం సేవలు అభినందనీయం


బీవీఆర్ కళా కేంద్రంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రం కళాకారుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక డీఎస్ చెరువు బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. బీవీఆర్ కళా కేంద్రం నిర్వాహకులు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్, నృత్యప్రియ డాన్స్ అకాడమీ వారిచే నృత్య ప్రదర్శనలు, అనంతరం మేనా నానాజీకి గౌరవ సేవా పురస్కారం, ఖండవల్లి నరుకుల సాయి శ్రీప్రియకు నాట్య రవళి పురస్కారం అందుకున్నారు. కళాకారులు, సాహితి సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీ


వరద బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఆత్మబంధువుల సంస్థ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన ఆత్మబంధువుల సేవా సంస్థ (ఏబీఎఫ్)ప్రతినిధులచే వరద ముంపు గ్రామాలైన కమ్మరిగూడెం, మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాధారం, ఉదయ్‌నగర్ ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని సుమారు 370 కుటుంబాలకు నిత్యావసరాలైన 9 రకాల కూరగాయలు, దుప్పట్లు, స్టీల్ కంచాలు, గ్లాసులు, గొడుగు, గుడ్లు, పప్పులు, ఉప్పు, చింతపండు, దుస్తులు అందజేశారు. అందురాలికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు. మంచినీటి అవసరాల కోసం బోర్లు వేసేందుకు నిర్ణయించారు. సీతాళం ఉషా కిరణ్, కొలనువాడ పెద్ద కృష్ణంరాజు, గ్రంధి సత్యనారాయణ, బుద్దాల రామారావు, వెజ్జు దుర్గా ప్రసాద్, ఉద్దండం ఏసుబాబు, నిట్, శశి విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల చేయూత అభినందనీయం



ఆస్పత్రిలో ఫ్యాన్‌లు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాత మల్లిన అరుణసారథి ఫ్యాన్‌లు అందజేయడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ద్వారా రొటేరియన్ మల్లిన అరుణ సారథి ఆర్థిక సౌజన్యంతో 15 సీలింగ్ ఫ్యాన్‌లు రోటర్ క్లబ్ అధ్యక్షుడు ఆనందరం మస్తాన్‌రావు అధ్యక్షతన డాక్టర్ అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు సద్వినియోగపడుతున్నాయని స్పష్టం చేశారు. అనంతరం అరుణసారథి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ట్రస్టు ద్వారా పేదలకు ఆసరాగా రూ.5 వేలు, రోటరీ క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వేల్పూరు గ్రామానికి చెందిన విద్యార్థిని సీహెచ్ శృతి ప్రతిభను గుర్తించి రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, కె.సిద్ధార్థ, అక్కిన కాశీ విశ్వనాథం, కలగల వెంకటకృష్ణ, డాక్టర్ కె.సత్యనారాయణరాజు, డాక్టర్ వి.వెంకటరాజు, డాక్టర్ ఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చారిటీ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెద కృష్ణంరాజు కోరారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక, సునీల్ అందుబాటులో ఉండి, అన్ని రకాల వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసర మైన వారికి, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు డాక్టర్ కె.సాగర్ బాబు ద్వారా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్యం, పక్షవాతం, సయాటికా వ్యాధులకు వైద్య సేవలతో పాటు, ప్లేట్‌లెట్స్, టైఫాయిడ్, మలేరియా, కిడ్నీ, లివర్ ఫంక్షన్, కొలస్ట్రాల్, గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు పెద కృష్ణంరాజు తెలిపారు. ప్రతీ నెల గురువారాల్లో రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. కార్డియాలజీ, గైనకాలజీ, చర్మవ్యాధుల నిపుణులు, అంకాలజీ, జనరల్, చిన్న పిల్లల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ–పంట నమోదు వేగవంతం చేయండి


పెదఅమిరంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల: ఖరీఫ్ ఈ–పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెదఅమిరం పుంతరోడ్డులో ఈ–పంట నమోదు తీరును ఆదివారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాలు నమోదుతోనే పంట సాయం, పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు వీలవుతుందన్నారు. ఇందుకు ఈ–పంట నమోదు తప్పనిసరి అన్నారు. పంట నమోదులో ఆలసత్వం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. రెతులు ఏ పంటను సాగుచేస్తే ఆ పంట వివరాలనే నమోదు చేయాలన్నారు. మరో పంట సాగు చేసినట్లు నమోదు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కౌలుదారు అనే విషయాన్ని స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు కౌలు రైతులతో మాట్లాడి వరి పంట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఈ.నాగార్జున, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వ్యవసాయ, రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులలో ఉద్యోగ పోటీ పరీక్షల పట్ల కనీస అవగాహన కల్పించేందుకు టాలెంట్ సెర్చ్ పరీక్షలు దోహదం చేస్తాయని రిటైర్డ్ సబ్ రిజిస్టార్ నీలం మాల్యాద్రి చెప్పారు. అంబేద్కర్ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివారం తణుకులోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన అంబేద్కర్ టాలెంట్ సెర్చ్ పరీక్షను నిర్వహించినట్లు కన్వీనర్ మురాల నవీన్ కుమార్ తెలిపారు. ఈ పోటీ పరీక్షకు తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రసంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అంబేద్కర్ భవన్ ఫౌండర్ కొండే నాగేశ్వరరావు, న్యూ ఇండియా ఎస్యూరెన్స్ మేనేజర్ ఎంఆర్‌జే నందా, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ బి.రమేష్, కె.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో 9 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పైడిపర్రు పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. పారిశ్రామిక వేత్త మల్లిన అరుణ సారథి ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం, పాల్గొన్నారు.

దేవస్థానానికి అన్నదాన ట్రస్టు నిధుల అందజేత

భీమవరం (ప్రకాశం చౌక్): అన్నపూర్ణ పార్వతి సమేత శ్రీ సోమేశ్వర లక్ష్మీ జనార్దన స్వామి వార్ల అన్నదాన చారిటబుల్ ట్రస్టులోని నిధులను ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానానికి అందజేశారు. గతంలో ట్రస్ట్ ద్వారా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు. ఈ క్రమంలో దాతలు ఇచ్చిన విరాళాల సొమ్ములు రూ.49,82,825.53లను సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానానికి ట్రస్టు చైర్మన్ చైర్మన్ వేగేశ్న రంగరాజు అప్పగించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. స్థానిక పెద్దలు హాజరయ్యారు.

నేటి నుంచి కేవీపీఎస్ శిక్షణా తరగతులు

భీమవరం: కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి చైతన్య శిక్షణా తరగతులు సోమవారం నుంచి మూడు రోజులపాటు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దళితులు, వెనకబడిన తరగతుల అభివృద్ధి కోసం కేవీపీఎస్ నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ దళిత పేటల అభివృద్ధికై కృషి చేస్తోందన్నారు. శిక్షణా తరగతులు పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ సి.నాగరాణి, ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి హాజరుకానున్నారని తెలిపారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని 37వ వార్డులో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, అఘోరాల నృత్యాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మన పూర్వీకులు గ్రామ శాంతి కోసం పండుగలు, జాతరలు, ఉత్సవాలు ఏర్పాటుచేశారని, ఆధునిక యుగంలో ఈ ఆచారాన్ని కొనసాగించడం వల్ల ఎన్నో విపత్తుల నుంచి బయటపడుతున్నామని, ఈ సంస్కృతిని రాబోయే తరం వారికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

15న వాండ్రంలో సువార్త సభ

ఉండి: వాండ్రం సెయింట్‌జాన్స్ లూథరన్ దేవాలయంలో ఈ నెల 15న ఉజ్జీవ సువార్త సభ నిర్వహిస్తున్నట్లు చర్చి ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ సభను ఉండి ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ పాస్టర్లు రైట్ రెవరెండ్ డీ మేషక్ సతీష్‌కుమార్, రెవరెండ్ ఎస్ఏజీ అబ్షాలోమ్ ప్రారంభిస్తారన్నారు. సిస్టర్ వల్లభనేని రాజకుమారి (నిడదవోలు) వాక్యోపదేశం చేస్తారని సంఘ సీఆర్ పాలపర్తి కెప్టెన్‌రాజు తెలిపారు. పేరిష్‌లోని అన్ని సంఘాల క్రైస్తవ విశ్వాసులు, ఆసక్తి గలవారంతా ఈ సభలో పాల్గొనాలని వారు కోరారు.

వీఐటీలో ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే

భీమవరం: పట్టణంలో డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వారి వీఐటీ ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే ఆదివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంగం వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2020–24 బ్యాచ్‌కి చెందిన సుమారు 800 మంది డిగ్రీ పట్టభద్రులకు సర్టిఫికెట్లు, బ్యాచ్ టాపర్‌కు బీవీ రాజు స్మారక పతకం, 26 మంది అకడమిక్ టాపర్లకు పతకాలు ప్రదానం చేశారు. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సమ్, డైరెక్టర్లు డాక్టర్ పి.శ్రీనివాసరాజు, ప్రసాద్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధించాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేక హోదా సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం పట్టణ మహిళా సంఘ భవనంలో జిల్లా సీపీఎం కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవలసిన బాధ్యత రాష్ట్రానిదేనన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ధాన్యం సొమ్ములు ఇంకా రాలేదని వెంటనే రైతులకు సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఖరీఫ్ పంటకు పెట్టుబడులు లేక ఎదురు చూస్తున్నారన్నారు. బకాయిలు వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు.

రహదారి విస్తరణ పనుల పునఃప్రారంభం


రహదారి విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం 68వ మైలు రాయి నుంచి 72వ మైలు రాయి వరకు నాలుగు కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్నారు. గతంలో వర్షాల కారణంగా ఈ రహదారి నిర్మాణం నిలిచిపోయింది. వాతావరణం అనుకూలించడంతో పనులు పునః ప్రారంభించారు. ఈ నెలాఖరుకు విస్తరణ పనులు పూర్తవుతాయని ఆర్అండ్‌బీ డీఎం కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు.

కనకదుర్గమ్మకు శ్రావణమాస పూజలు


శ్రావణలక్ష్మిగా కనకదుర్గమ్మ

పెంటపాడు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ప్రత్తిపాడు వై జంక్షన్ కనకదుర్గమ్మకు శ్రావణ శుక్రవార పూజలు ఈ నెల 16, 23 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో శ్రీదేవి, దేవాదాయశాఖ అధికారి మొగ్గళపు పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ బ్రహ్మత్వంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఆ రోజులలో ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలవారు ముందుగా ఆలయం వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు దేవాలయ వేళల్లో సంప్రదించి రసీదు పొందాలన్నారు.